# ★ శ్యామల ★

శ్రీ కె. జి. ఆచార్య

'చెల్లీ!......శ్యామలా!...'

'ఆ! వస్తున్నా!'

'సాయంత్రం జరిగిన సభలో ఇందిరాదేవిగారి వుపన్యాసాన్ని శ్రద్ధగా విన్నావుగదూ?'

'ఆ! విన్నాను. చాలా బాగున్నదన్నయ్యా!'

'అయితే, ఆమె చెప్పిన వుపన్యాసంలోని ముఖ్యాంశాలు కొన్ని నీవు చెప్పగలవా?'

'ఆ! చెబుతా, విను!...ఆమె మన హిందూమతంలో చీడపురుగులా వ్యాపించిన అతి బాల్య వివాహాచారాన్ని ఖండిస్తూ, దానివల్ల అల్పజ్ఞానినులగు బాలికలకు గలిగే అనర్థాల్ని స్పష్టపరిచింది. ఏమీ తెలియని వయస్సులో వున్న కన్యలకు పెళ్లిళ్లుచేసి, ఖర్మం జాలక దురదృష్టవశాత్తూ, ఆ చిన్నతనంలోనే ఆ బాలికల భర్తలు చనిపోతే, పాపం వాళ్లను జీవితాంతమువరకూ అలంకారశూన్యలైన, అక్షర జ్ఞాన విహీనులైన, గౌరవ రహితులైన విధవలుగా చేస్తున్నారనియు చెప్పింది. మన పూర్వాచారపు వాళ్లు, మతాచార రక్షణకోసమని యిలా చేస్తున్నారే గాని, మన అమాయిక అమ్మాయిలను అధఃపతితురాండ్రుగ జేస్తున్నామని యోచించడం లేదనీ చెప్పింది. ఇలాగ ఆ బాల్యవివాహాలవలన జరిగే కష్టనష్టాల్ని విశదీకరిస్తూ, ప్రస్తుత మిప్పుడు విద్యాశూన్యలైన ఆ అనాథ బాలికలకు, దేశసేవ, భక్తి, కరుణ, అహింస మొదలైన సద్గుణాల నుద్భవింపజేసే విద్య నేర్పించడం అవసరమనియూ, యీ సంస్కరణ దిగ్విజయంగా నెరవేరాలంటే స్త్రీ పురుషులంతా ముఖ్యంగా నవయువకులూ, నవయువతులూ నడుంకట్టి పూనుకోవాలని ఆమెచెప్పింది. తర్వాత స్త్రీలకు విదేశీనాగరికత, విదేశీ విద్యవలన గలిగే నష్టాల్నీ, జాతీయ నాగరికత, జాతీయ విద్యవలన గలిగే లాభాల్నీ స్పష్టపరుస్తూ ఆఖర్ని చెప్పి ముగించింది!......'

'చెల్లీ! నీ వట్టే చదువుకోకపోయినా, ఆమె చెప్పిన మాటలన్నీ పూసగుచ్చినట్లు చెప్పగలిగేవుసుమా!...'

'అన్నయ్యా!... నే నిక్కడే-నీ దగ్గరే వుండిపోయి, బాగా చదువుకోవాలని వుంది. పెద్దపెద్దవాళ్లు యిచ్చే యిలాటి వుపన్యాసాలూ, వాళ్లు వ్రాసిన మంచి మంచి పుస్తకాలూ చదవాలని వుందన్నయ్యా...!'

ఇందాకటినుంచీ ముద్దు చెల్లెలి ముఖారవిందాన్ని చూస్తూ, మృదుమధుర పలుకుల్ని వింటూ ముగ్ధుడైపోతూ వున్న ఆ యువకుణ్ణి, అతని చెల్లెలన్న యీ తుదిమాట, ఆ క్షణంలోనే చింతాక్రాంతుణ్ణిచేసివైచింది!... 'అయ్యో, తల్లీ! అంత అదృష్టమా?' అంటూ వేడి నిట్టూర్పొకటి విడిచేడు!

※

శ్యామలా రామారావు లిద్దరూ, మహదేవశాస్త్రి మొదటిభార్య బిడ్డలు. శ్యామల పుట్టిన రెండేళ్లకే వాళ్ల తల్లి చనిపోవడంచేతనూ, తండ్రి రెండోపెండ్లి చేసుకోవడంచేతనూ, అన్నా చెల్లెళ్ల చిన్నతనాలు యెన్నో గండాల్లో గడిచాయి. రామారావు మాత్రం, తన యెనిమిదోయేడు దగ్గర్నుంచే, తండ్రిని వదలి మేనమామదగ్గరుండడంవల్ల అతనికి విద్యాబుద్ధులు చక్కగా అలవడినాయి. శుద్ధ చాందస బ్రాహ్మణుడైన తన తండ్రి పూర్వాచారానికీ, మారటి తల్లి మదింపులకూ, సతాయింపులకూ లొంగి వుండవలసి వచ్చుటచేత పాపం శ్యామలకు మొదట్లో చాకలి పద్దులకు పనికివచ్చే చదువు తప్ప యింకేమీ అలవడలేదు! అంతేగాక హిందూమూఢాచార పిశాచమైన అతి బాల్యవివాహానికి లోనై, లేప్రాయమైన పదోయేటనే 'బాలవితంతు' బిరుదాన్ని స్వీకరించవలసి వచ్చింది! అ అల్పవయస్సులోనే అలంకారా లన్నిటినీ త్యజించవలసి వచ్చింది!! అప్పు డేమీ తెల్సిందిగాదు పాపం!...కాని...యిప్పుడో? ఆమెకు పదిహేనేళ్లు వచ్చిన యీ సమయంలో—ఆ రోజు కారోజు నవనవోజ్వల రూపలావణ్యాలతో, సుజ్ఞానంతో వుట్టిపడుతూన్న యిట్టి యౌవనసమయంలో, ఆమె నేత్రాలు తెరచుకున్నాయి! చదువుమీద అమితమైన శ్రద్ధ బుట్టింది. ఇంకే యితర కోరికాలేదు! తనకు భర్త లేడనిగానీ-అలంకారశూన్యరాలననిగానీ-విచారించేదే గాదు; కేవలం ఒక్క చదువు లేదనే దుఃఖించేది పాపం! యేడాదికి యేమూడునెలలో మేనమామగారి వూరికి వెళ్లి వుంటూంటేది! మేనమామ కాలాన్నిబట్టి, అందులోనూ-మంచితనాన్ని మాత్రమే గ్రహించి నడుచుకోవాలనే

వుద్దేశ్యం గలవాడు గాబట్టి అక్కడ చదువుకోనడానికి సమయం లభించేది శ్యామలకు. అప్పుడుమాత్రం స్త్రీలకు సుజ్ఞానాన్ని బోధించే యే 'గృహలక్ష్మి' లాంటి పత్రికలోన్నో యింకే యితర పుస్తకాలోన్నో చదువుతూ, తన చదువుతోబాటు జ్ఞానాన్నిగూడా అభివృద్ధిజేసుకుండేది సూక్ష్మగ్రాహిణి గనుక !

ఆ సూక్ష్మబుద్ధివల్లనే, శ్యామల అల్పచదువురాలైనా, యిందిరాదేవి వుపన్యాసాన్ని అన్నదగ్గర వున్నది వున్నట్లు విడమర్చి చెప్పగలిగింది. నిజంగా అన్నతోటి వెళ్లి మద్రాసులోవిన్న యిందిరాదేవి వుపన్యాసమే, శ్యామల మనస్సులో నాటుకుపోయివున్న విద్యాభ్యాస కుతూహలాన్ని మరింత వృద్ధిపరచింది! అందుచేతనే శ్యామల, అన్నదగ్గర తన ముఖ్యాభిలాషను తుదిమాటల్లో స్పష్టపరిచింది !

※

రామారావు మద్రాసులో గవర్నమెంటు వుద్యోగం చేస్తున్నాడు. అతనికి శ్యామలంటే యెంతో ప్రేమ! 'చెల్లీ! చెల్లీ!!' అంటూనే యెంతో ముగ్ధుడైపోతూ వుండేవాడు చిన్నప్పటినుంచీగూడా! ఇప్పుడు శ్యామల విద్యాశూన్యురాలైనందుకూ, పతివిహీనురాలైనందుకూ, ఒకొక్కప్పుడు కుమిలిపోతూ దుఃఖిస్తూ వుంటాడు. చెల్లిలి దుఃస్థితికి కారణం, తన తండ్రి మూఢ పూర్వాచారమేననీ, సవతితల్లి కుటిల ప్రవర్తనమేనని తిట్టుకుంటూ వుంటాడు. చెల్లెల్ని యెలాగైనా తనదగ్గరుంచుకొనియే 'సేవాశ్రమం' లాంటి స్త్రీల ఆశ్రమంలోనైనా జేర్పించి ఆ అనాథురాలి ముఖ్యాభిలాషను నెరవేర్చాలని యిప్పుడతని గట్టి పట్టుదల! కానీ,...తండ్రి చీవాట్లనుండి తప్పించుకోని తాను బియ్యే ప్యాసయ్యేటప్పటికే బ్రహ్మాండం అయిపోయింది! యెన్ని తిట్టినప్పటికినీ—యెన్ని కొట్టినప్పటికినీ—గూడా మేనమామ అండగా వుండడంవల్ల శ్రద్ధగా చదువగలిగేడు. చిన్నప్పటినుంచి, తండ్రి దురుసుతనానికి జడిసేవాడు; అంతేగాని యెప్పుడూగూడా తండ్రిమీద జబర్దస్తీ జేసి యెరుగడు పాపం! అంచేత శ్యామలవిద్యాసమస్య దుర్భరమైపోయింది అతనికిమాత్రం !

ఉద్యోగంలో చేరి పనిచేస్తూవుండడంవల్ల యేడాదివరకూ తన జన్మస్థానమైన ఆ పల్లెటూరికి వెళ్లలేకపోయేడు. సంవత్సరమంతా సోదరీ వియోగాన్ని సహిస్తూ ప్రతీరోజూగూడా యెంతో విచారిస్తూ వుండేవాడు !

మొన్నటి శెలవుల్లోవచ్చి, మళ్లీ పదిరోజుల్లోనే పంపేస్తానని తండ్రికి యేలాగో నచ్చజెప్పి శ్యామలను మద్రాసుకు తీసుకువచ్చాడు. ప్రతిరోజూ మద్రాసులోని వినోదాల్ని, విజ్ఞానాన్నభివృద్ధిజేసే వస్తువుల్ని జూపిస్తూ ప్రస్తుతం అక్కడ జరుగుతూన్న స్త్రీల సభలకు తీసుకొని వెళ్లుతూ, ఆ చెల్లెల్ని సంతోషబెట్టడంతో తానుగూడా సంతోషంతో తన్మయుడైపోతున్నాడు.

అప్పుడే శ్యామలను తీసుకువచ్చి నెలరోజులయింది! యింకా పదిరోజులుపాటు వుంచుకుందామా అంటే; ఇప్పటికే తండ్రిదగ్గర్నుంచి యెనిమిది తొమ్మిది వుత్తరాలొచ్చాయి తొందరగా పంపమని. అందులోన్నూ ఆఖరి వుత్తరం తన తండ్రి కోపాన్నంతా ప్రత్యక్షపరుస్తూ వుండడంవలన యీ సారి పంపడం తప్పనిసరి! తప్పదు గాబట్టి యీసారి మేనమామతో పంపేసి, యింకోపర్యాయం సాహసించియైనా, చెల్లెల్ని తీసుకొచ్చేయాలని దృఢనిశ్చయంజేసుకున్నాడు. ఆ దృఢనిశ్చయమే, శ్యామల విద్యాభిలాష యితోధిక మవడానికి హేతువయింది !

※

'ఏమేఁ? సోవీ? యిన్నిరోజులున్నావే? ఆ అన్న వెధవ తీసుకువెళ్లుతానంటే రాననగూడదూ? పైగా వెళ్తానని యేడుస్తావా? విధవముండవిగదా, యింట్లో పడివుండలేవూ? వాడొక కిరస్తానీ వెధవ అయ్యేడుగదా, యిక నిన్నుగూడా అలాగ చేద్దామనుకుంటున్నాడు కాబోలు!......అమ్మ! వెధవల్లార! నా మతాచారాన్నంతా మంటలో గలిపేయడానికి పుట్టేరా మీరు?'...

బండిదిగి, యింటిగుమ్మంలో కాలిడేసరికి యీ కఠోరపు మాటలే వినబడ్డాయి పాపం శ్యామల చెవులకు! మృదుల హృదయాన్ని కొరవితో కాల్చేసినట్లయిపోయింది! అప్పటినుంచి మళ్లీ యథాప్రకారంగా అంధకారకూపంలో పడిపోయింది ఆపసిపాప! సవతితల్లి చీవాట్లూ, మదింపులూ—తండ్రి తిట్లూ—యేమాత్రంగూడా తగ్గలేదు. పైగా ఆడవాళ్లకు చదువు అక్కర్లేదను మూఢసిద్ధాంతాన్ని నమ్మే తన తండ్రిమూలాన్ని, చదువుకోనడానికి అన్నదగ్గర్నుంచి తెచ్చిన పత్రికాసంపుటాలు, పుస్తకాలు అన్నీగూడా అగ్నిహోత్రుడికి ఆహుతి చేయవలసి వచ్చింది! చదువంటే యెంతో శ్రద్ధా, ప్రీతీగల ఆ శ్యామల మనస్సు, యీ ఘోరాన్యాయానికి చివుక్కుమంది !

※

కాలచక్రం అతి వేగంతో తిరిగిపోతూవుంది. అప్పుడే శ్యామల అన్నదగ్గర్నుంచి వచ్చి పదినెలలైపోయింది. అక్కడ రామారావూ, యిక్కడ శ్యామలా—యిద్దరూ ఒకర్నొకరు చూచుకోవాలని వేగిరపడుతున్నారు. రా

మారావు యెల్లప్పుడూ, తనముద్దు చెల్లెల్ని విద్యావంతురాలుగ చేయాలనే తన ముఖ్యోద్దేశాన్ని నెరవేర్చడానికి ఆలోచనా సాగరంలోని అలల్తో కలిసి మునుగుతూ, తేలుతూ వున్నాడు.

ఈస్టరు శెలవు లిచ్చారు. రామారావు వెంటనే ప్రయాణమై తండ్రిగారి వూరు వచ్చేసేడు. ఇప్పుడు మరీ హీనంగా వున్న చెల్లెలి దైన్యస్థితి చూచీ చూడ్డంతోనే, అతని కళ్లల్లోనుండి రెండు కన్నీటి చుక్కలు జలజల రాలేయి పాపం! చెల్లెలివిషయంలో తండ్రి హృదయం యింత కఠోరంగా వుండడానికీ, చెల్లె లింత దైన్యస్థితికి రావడానికి అసలు కారణం; ఆ మారటి తల్లి మహిమే నని గ్రహించేడు. జబర్దస్తీగా గాకుండ, యింకెలాగైనా సరే, చెల్లెల్ని మద్రాసు తీసుకువెళ్లి పోవాలని నిశ్చయించుకున్నాడు. వారంరోజులున్న తర్వాత ఒకనాడు రహస్యంగా యేదో చెప్పేడు. ఆ నాడే సాయంత్రం, మేనమామగారి వూరికివెళుతున్నానని తండ్రితో చెప్పి వెళ్లిపోయేడు.

ఆ నాడే ఆదివారం. అది నిశీథసమయం. తొమ్మిది గంటలయింది. అన్న ప్రోత్సాహమువలన శ్యామల విద్యాభిలాష, యితోధికమై, ఆమెను సాహసురాలుగ జేసివైచింది! ఒంటరి బాలికయైనప్పటికినీ గూడా, అంధకారబంధురమైన ఆ నిశీథసమయంలో యెవ్వరితో చెప్పకుండాయిల్లువిడిచి అదృశ్యురాలైపోయింది!!

★

ఉదయాన్నే మహాదేవశాస్త్రి లేచి, గదిలో శ్యామల లేకపోయేటప్పటికి కంగారుపడ్డాడు. ఇల్లు అంతా వెదికేడు. శ్యామల కనబడలేదు; కాని 'మ.రా.శ్రీ. నాన్నగారికి' అనే అక్షరాలున్న కవరు వుత్తరం కనబడింది. శాస్త్రి నివ్వెరపడుతూ చదువసాగేడు. దానిలో యిలా వుంది:-

'శ్రీపూజ్యులైన నాన్నగారికి---

ప్రప్రథమమున తమ యాజ్ఞను తిరస్కరించిన నన్ను క్షమించ ప్రార్థించుచున్నదానను. నేనింకే యితర కోరికల నభిలషించక కేవలము విద్యనుమాత్రమే---అందులోనూ, స్త్రీలను కొద్దికాలములోనే మంట గలుపు విదేశీ నాగరికతతో నిండిన విద్యనుగాక---కేవలము; దేశసేవ, పతిభక్తి, ప్రజాసేవ, కరుణ మున్నగు స్త్రీ జనయుపయుక్తములగు సద్గుణముల నుద్భవింపజేసే- పెంపొందించే-భారతజాతీయ స్త్రీ విద్యను మాత్రమే, హృదయపూర్వకముగ నభిలషించుచున్నదానను గనుక నిట్టి సాహసము జేసితిని. క్షంతవ్యురాలను. అన్నయ్యదగ్గరనే యుండి మంచి ప్రవర్తన గలిగియుందును. రెండు నెలలలోనే మీ రొకపరి వచ్చి నా ప్రవర్తన విద్య బాగుగ నుండనిచో దండింపవచ్చును. మరల క్షమింప వేడుచున్నాను.

ఇట్లు,

మీ తనయ

అందులోనే వున్న యింకో కాగితాన్ని గూడా చదివేడు. యిలావుంది:-

'శ్రీ నాన్నగారికి,

చెల్లెలి స్థితిని బాగుచేయుటకై, దాని విద్యాభిలాషను కనిపెట్టి, చదువు చెప్పించెదనని మీ యెదుట చెప్ప సాహసించలేకపోయినాను. అందుచేత తమకు చెప్పకుండా, తీసుకువెళ్లుటకు కారణమయినది. చెల్లెలి స్థితిని చూడలేకపోతిని. ఇక్కడ నాకు తోడూ-నీడా లేనందువలన చెల్లెల్ని ప్రేమతో వుంచుకుంటాను. మిగిలిన సంగతులన్నీ మామయ్యగారి నడిగి తెలుసుకొనవలెను. క్షమించ ప్రార్థన.

ఇట్లు,

మీ కుమారుడు రామారావు

మహాదేవశాస్త్రి వెంటనే నిశ్చేష్టుడైపోయి, గోడకు జారగిలబడ్డాడు. అతని చేతులోవున్న ఆ రెండు వుత్తరాలుగూడా నేలమీద బడిపోయాయి !

※

శ్యామల మద్రాసులోని 'సేవాశ్రమం'లో చేరి, తన పతివిహీనతనూ, అలంకార శూన్యతనూ, చింతించకుండా, పూనికతో విద్య నభ్యసించి తన విద్యావిహీనతను పారద్రోలింది. తరువాత యిప్పుడు బాల్యవివాహాలను ఖండిస్తూ, బాలవితంతు వివాహాలను సమర్థిస్తూ, దేశైక్యతకు పాటుబడాలని ప్రబోధిస్తూ వుపన్యాసా లివ్వడంతో - పాటుపడడంతో - తన సంఘ సంస్కరణాభిలాషను, దేశసేవాభిలాషను నెరవేర్చుకుంటూవుంది యెంతో సంతసంతో. శ్యామల చాతుర్యాన్ని, సదభిలాషల్నీ తలుచుకుంటూ రామారావు సంతోషాంతరంగుడైపోతున్నాడు !